# జీవితం
# ఇలా కూడా ఉంటుందా..?



## అంగులూరి అంజనీదేవి

# జీవితం
# ఇలా కూడా ఉంటుందా..?

## అంగులూరి అంజనీదేవి

**కపిల్ పబ్లికేషన్స్**
హన్మకొండ, వరంగల్ జిల్లా.

# *Jeevitham Ila Kudaa Vuntunda..?*

**(Direct Novel)**

By

**ANGULURI ANJANI DEVI**
P.B.R. Complex, H.No. 1-7-1044/2,
Up-Stair Indian Bank, Hunter Road,
Hanamkonda, Warangal Dist.
Cell: 7893555237
Emial: anguluri.anjanidevi.novelist@gmail.com
Website: www.angulurianjanidevi.com

*Published by :*

**Kapil Publications**
Hanamkonda, Warangal Dist.

*First Edition :*

**May 2015**

*Price :* **Rs. 120-00**

Cover Design :

**Anguluri Anjani Devi, Prakash Pula**

Printed at:

**KAPIL OFFSET PRINTERS**
Hanamkonda, Warangal Dist.




యద్దనపూడి సులోచనరాణి మాతృమూర్తి నవలా పురస్కారం-2010ను
ప్రముఖ రచయిత్రి యద్దనపూడి సులోచనరాణి నుండి అందుకుంటున్న నవలా రచయిత్రి అంగులూరి అంజనీదేవి

# అంగులూరి అంజనీదేవి
# రచనలు

*నవలలు :*

1. మధురిమ
2. నీకు నేనున్నా...
3. మౌనరాగం
4. ఈ దారి మనసైనది
5. రెండో జీవితం
6. ఎనిమిదో అడుగు
7. ఆమె అతడిని మార్చుకుంది
8. ఆరాధ్య
9. ఇలా ఎందరున్నారు...?
10. జ్ఞాపకం
11. జీవితం ఇలా కూడా ఉంటుందా..?
12. ఒక చిన్న అబద్ధం...!

*కథల సంపుటి :*

1. జీవితం అంటే కథ కాదు!

*కవితా సంపుటి :*

1. గుండెలోంచి అరుణోదయం

# జీవితం ఇలా కూడా ఉంటుందా..?

ప్రేమంటే ఒక లోతైన అవగాహన. అది ఎవరి మధ్యనైనా పుట్టొచ్చు. అది వుంటేనే జీవితం సంతోషంగా, అద్భుతంగా వుంటుంది. ఎప్పుడైనా తర్కం (లాజిక్) గుడ్డిదేమో కాని ప్రేమ గుడ్డిది కాదు. అదొక మౌన తరంగిణి. దాన్ని 'నువ్వు నాక్కావాలి' అని ఎవరూ అడగలేరు. 'నేను నీతోనే వుంటాను' అని ప్రేమ కూడా ఎవరితో చెప్పదు. అలాంటప్పుడు ప్రేమతో 'నువ్వు ఎక్కడికీ వెళ్లకు, నాతోనే వుండు' అని ఎలా చెప్పగలం... అదొక అనంతం. శక్తివంతం. ఆది, అంతం లేని మహోజ్వల జ్వాలా ప్రహేళిక. ఆపినా ఆగని భావోద్వేగపు ఉప్పెన. ఆ ఉప్పెనలో మునిగేవాళ్లున్నారు. అభిషేకించబడేవాళ్లున్నారు. ముంచినా, అభిషేకించినా అది ప్రేమకే సాధ్యం. ప్రేమ ఒడిని మించిన ఓదార్పును ఈ ప్రపంచంలో ఏమిస్తుంది? కానీ అలాంటి ప్రేమను పొందాలన్నా, జయించాలన్నా కొంత సాధన కావాలి. అంకితభావం

కావాలి. అదృష్టం వుండాలి. ఏ అదృష్టాన్నయినా అర్హత లేకుండా అందుకోగలమా??

జీవిత యుద్ధంలో మనిషి గెలవాలీ అంటే పోరాటం తప్పనిసరి. ఆ పోరాటం న్యాయబద్ధంగా ధర్మబద్ధంగా వుండాలి. కానీ మన ఆధీన రేఖ దాటి శాంతియుతంగా వున్న భారతసైనికుల మీద దాడులు జరిపి తలల్ని నరికేసి, శరీరాన్ని మన భూభాగంలో వదిలి తలల్ని పాకిస్తాన్ వాళ్లు పట్టుకెళ్లారు. నిజంగానే యుద్ధం జరిగినప్పుడు చనిపోతే వీరమరణం కాని యుద్ధం లేకుండానే దాడులు జరపడం, చంపడం పిరికిపంద చర్య. ఇది అసలు యుద్ధవీరుల నైజమే కాదు. నైతికత అంతకన్నా కాదు.

అంకిరెడ్డికి నిద్రపట్టక తన లాప్‌టాప్‌ని ఓపెన్ చేసి ఫేస్‌బుక్‌లోకి లాగిన్ అయ్యాడు. అక్కడ తన హోమ్‌లో పోస్టయి వున్న వీడియోను క్లిక్ చేశాడు. పాకిస్తాన్ సైనికులు, భారతదేశ సైనికులతో యుద్ధం చేస్తున్నారు. వేల రౌండ్ల తూటాలను ఫైర్ చేస్తున్నారు. దాన్ని చూడగానే కళ్లు తిరిగి బెడ్ మీద పడిపోయాడు అంకిరెడ్డి. ఆ తర్వాత ఆయన ఎప్పుడు నిద్రపోయాడో ఆయనకే తెలియదు.

తెల్లవారి నిద్రలేచి వాకింగ్‌కి వెళ్లాలని కారును బయటకు తీశాడు అంకిరెడ్డి. ఆయన కారు మెయిన్‌రోడ్డు మీద తిన్నగా వెళ్తోంది. ఆయన ఆలోచనలో ఆయన వున్నాడు. కాలేజి గేటు రాగానే డ్రైవింగ్ సీట్లో కూర్చుని వున్న అంకిరెడ్డి అలర్టయి కారును కాలేజీ లోపలికి పోనిచ్చాడు. గేటు పక్కన వున్న చింతచెట్టు కింద కారును ఆపుకొని నడవటం ప్రారంభించాడు. అలా ఓ పదినిమిషాలు నడుచుకుంటూ వెళ్తే ఆయన వాకింగ్ చేసే ప్లేగ్రౌండ్ వస్తుంది. ఆ గ్రౌండ్‌లోకి వెళ్లి నాలుగు రౌండ్లు నడుస్తాడు. తర్వాత ఏరోబిక్స్ ఓ పది నిమిషాలు చేసి కారు దగ్గరకి ఒక పదినిమిషాల్లో నడుచుకుంటూ వస్తాడు. ఒకటా రెండా ఇరవై సంవత్సరాలుగా ఆయన దినచర్య అది...

ఆయన నడుస్తూనే వున్నాడు. గ్రౌండింకా రాలేదు. వారం రోజులుగా వర్షం పడుతున్నందువల్ల రోడ్డుకి ఇరువైపుల వున్న చెట్లు

పచ్చబడ్డాయి. నేలమీద మొలిచిన పచ్చిక చిక్కబడింది. పువ్వులు విరబూసి అప్పుడప్పుడు తొడిమల నుండి విడిపోయి కింద పడుతున్నాయి. తలపైకెత్తి చూస్తే పొన్న, తురాయి, మద్ది, వేప, కానుగ చెట్ల మధ్యలోంచి నీళ్లు తాగి రావటానికన్నట్లు వేగంగా వెళ్తున్న మేఘాలు కన్పిస్తున్నాయి.

ఆ దృశ్యాలేమీ అంకిరెడ్డికి కనబడటం లేదు. ఆయన తల వంచుకుని నడుస్తూ వున్నాడు. ఎప్పుడైనా ఆయన అలా వుండేవాడు కాదు. ఎండాకాలం వస్తే ఎండని, వర్షాకాలం వస్తే వర్షాన్ని, ఏమీ లేకుంటే ఆకాశాన్ని చూసైనా ఆనందిస్తాడు. ప్రతిదీ హృదయంతో చూస్తాడు. మనసుతో ఆనందిస్తాడు. ఈ కాలం వచ్చిందంటే "ముళ్లుంటాయి రెడ్డీ! వద్దు. రోడ్డుపైకి రా! షూష్ విప్పి పచ్చికలో అలా వట్టి పాదాలతో నడవటం సేఫ్ కాదు" అని స్నేహితులు అంటున్నా నవ్వి వినకుండా నడిచేవాడు. ఏ సరదాను చంపుకునే వాడు కాదు. కానీ ఈరోజు ఎందుకో ఆయన మనసు ఉత్సాహంగా లేదు. చాలా రసహీనంగా, దిగులుగా, గుబులుగా, భయంగా వుంది. హృదయం మొత్తం డ్రైడ్రైగా వుండి ఊపిరి కూడా సరిగా ఆడటం లేదు.

వాకింగ్‌కి వెళ్లే ముందు ఆయన భార్య మాధవీలత రాత్రి నీళ్లలో నానబెట్టిన మెంతులు, బాదాంపప్పు, రాగి చెంబుతో నీళ్లు ఇచ్చి "ఏంటండీ అలా వున్నారు?" అని అడిగింది. ఆయన సమాధానం చెప్పకుండా మూగవాడిలా చూడగానే ఆమె మౌనంగా వెళ్లి గేటు దగ్గర పడివున్న పేపర్ పట్టుకొచ్చింది. ఆయన బాదం పప్పు తిని నీళ్లు తాగుతుంటే పేపర్ని ఆయన ముందున్న టీపాయ్ మీద పెడుతూ ఆయన ముఖంలోకి పరీక్షగా చూస్తూ నిలబడింది. ఆయన నవ్వి "ఏంటే! పీచ్చీ! ఎందుకలా చూస్తావ్? కొత్తవాడిని చూసినట్లు..." అన్నాడు.

"మీరు కొత్తగానే వున్నారండీ! ఏదో పోగొట్టుకున్నట్లు కన్పిస్తున్నారు" అంది. ఆమె చాలా సునిశిత చూపు కలిగిన మహిళ. భర్తలో ఏ మార్పు వచ్చినా వెంటనే పసిగట్టేస్తుంది. ముఖం మీద వచ్చిన ముడతలనే కాదు. మనసులో వచ్చిన ముడతను కూడా కనిపెట్టయ్యగలదు. అది తెలిసి, ఆయన భార్యకు మాట్లాడే అవకాశం

ఇవ్వకుండా రెండు చేతులతో పేపర్ పట్టుకొని సీరియస్‌గా చదువుతూ కూర్చున్నాడు. ఆమె వంటగదిలోకి వెళ్లి వేడివేడిగా కాఫీ కలుపుకుని వచ్చి ఆయన చేతికి ఇచ్చింది. అప్పుడు కూడా అదే ప్రశ్న ఆమెలో... ఆయన కాఫీ తాగి "మధూ! కారు కీస్ తెచ్చివ్వు" అంటూ లేచి బయటకెళ్లి స్పోర్ట్స్ షూస్ వేసుకున్నాడు. ఆమె కారు కీస్ తెచ్చివ్వగానే కారులో కూర్చుని గ్రౌండ్‌కి వచ్చాడు.

వాకింగ్‌కి వచ్చినా ఆయన మానసిక స్థితిలో మార్పు లేదు. అదే ఆలోచన. అదే బాధ. రోడ్డు దిగి ఎప్పటిలాగే గ్రౌండ్‌లోకి వెళ్లి నడుస్తున్నాడు. భార్య అన్నట్లు నిజంగానే తను కొత్తగా కన్పిస్తున్నాడా? ముఖంలో బాగా మార్పు వచ్చిందా? ఆలోచిస్తున్నాడు అంకిరెడ్డి.

రోడ్డు మీద నడుస్తున్న ఆయన స్నేహితులు ఆయన్ని చూసి ఆశ్చర్యపోతూ "రెడ్డీ!" అంటూ పిలిచారు. అంకిరెడ్డి పలకలేదు.

జాన్, నాయక్, వాసుదేవ్ చప్పట్లు కొడుతూ "రెడ్డీ! గ్రౌండ్ మొత్తం బురదగా వుంది. రోడ్డు మీదకు రా! వచ్చి మాతో జాయినవు" అంటూ పిలిచారు.

ఆ గ్రౌండ్ ఒకప్పుడు అలా లేదు. రోజుకి నూటయాభై ఏడు మంది వాకర్స్ నడిచే ఆ గ్రౌండ్‌కి రెండు సంఘాలు ఏర్పాడి ఈ మధ్యనే మట్టితో ఎత్తు, పల్లాలు లేకుండా నీట్‌గా చేయించారు. అంతేకాదు వాకర్సంతా నెలకి, ఇంత చొప్పున డబ్బులు పోగు చేసుకొని సంఘసేవ కూడా చేస్తుంటారు. వాళ్లలో ఎక్కువగా ముందుకొచ్చి ఏది చెయ్యాలన్నా ఉత్సాహం చూపేది జాన్, నాయక్, వాసుదేవ్. ఈ మధ్యన అంకిరెడ్డి కూడా వాళ్లతో కలిశాడు. వాళ్లే ఆ సంఘానికి సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీ, ప్రెసిడెంట్, ట్రెజరరీగా వ్యవహరిస్తుంటారు. గౌరవ అధ్యక్షులుగా ఎప్పటికీ వాసుదేవే వుంటుంటాడు.

గ్రౌండ్‌లో నడుస్తున్న అంకిరెడ్డి వాళ్లు పిలుస్తుండగానే తల తిరిగినట్లై కింద పడిపోయాడు. ఆజానుబాహుడైన అంకిరెడ్డి ఎత్తైన చెట్టు నేలమీదకి ఒరిగినట్లు దబ్బున పడిపోవడంతో రోడ్డుమీద వాకింగ్ చేస్తున్న ఆయన స్నేహితులతో పాటు మిగిలిన వాకర్సంతా "అరెరె!

రెడ్డి పడిపోయాడు రండి! రండి!” అంటూ ఒకరిని ఒకరు పెద్ద గొంతుతో పిలుచుకుని, రోడ్డు దిగి అంకిరెడ్డి దగ్గరకు పరిగెత్తారు.

అంకిరెడ్డి అప్పటికే లేవబోతున్నాడు. తన చుట్టూ చేరిన వాకర్స్‌ను చూసి అసలేం జరిగిందో ఒక్కక్షణం అర్థంకాక బిత్తరపోయాడు. ఆయన తేరుకుని వాళ్ల వైపు చూసేలోపలే వాసుదేవ్, జాన్, నాయక్ ఆయన్ని తమ చేతుల మీదుగా తీసికెళ్ళి చెట్టుకింద కూర్చోబెట్టారు.

“వాటరుంటే పట్టుకురా జాన్!” అని వాసుదేవ్ అనగానే జాన్ వెళ్లి తన కారులో వున్న వాటర్ బాటిల్ తెచ్చాడు. బాటిల్ మూత విప్పి తనే స్వయంగా అంకిరెడ్డితో నీళ్లు తాగించాడు. రెండు గుక్కలు నీళ్లు తాగి “ఇక చాలు జాన్! థాంక్యూ!” అంటూ జాన్ వేపు చూశాడు అంకిరెడ్డి.

అంకిరెడ్డి ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్న మార్పును చూసి ఉలిక్కిపడ్డాడు జాన్. నిన్న బాగానే వున్న అంకిరెడ్డి ఇవాళ ఎందుకిలా వున్నాడన్న సందేహం జాన్ ముఖంలో చూసి మిగిలినవాళ్లు కూడా అంకిరెడ్డి ముఖంలోకి గుచ్చిగుచ్చి చూశారు. అంకిరెడ్డికి ఆ వాతావరణం ఇబ్బందిగా వుంది. వాళ్లంతా తనను వదిలి వెళ్లిపోతే బాగుండని వుంది. ఒక్కరు కూడా అక్కడ నుండి కదలటం లేదు. కాకిపిల్ల కింద పడితే కాకులన్నీ గుంపులా చేరి ‘కాకా’ అని అరిచినట్లు “ఎలా వుంది రెడ్డీ?” అంటూ ఆయన చుట్టూ గుమిగూడారు. వాళ్లు అలా అడుగుతుంటే ఆయనకు వూపిరాడటం లేదు.

“మీరేం కంగారు పడకండి! నేను ఓ.కె.” అంటూ అందరివేపు చూసాడు. ఆయన గొంతు ఎప్పటిలా గంభీరంగా లేదు. ఏదో చిన్న జీర. ఆ జీరలోనే ఆయన పడుతున్న ఆందోళన ధ్వనిస్తోంది.

ఆయన “నేను ఓ.కె.” అనగానే చాలామంది వాకర్స్ అక్కడ నుండి వెళ్లిపోయారు. ఇప్పుడు ఊపిరాడింది అంకిరెడ్డికి.

“జాన్! నువ్వెళ్ళి రెడ్డిని ఇంటి దగ్గర దింపిరా!” అంటూ వాసుదేవ్ జాన్ వేపు చూశాడు. వాసుదేవ్ వర్షాల వల్ల నాలుగు రోజుల నుండి వాకింగ్‌కి రాలేదు. ఆయన ఇంకా ఓ మూడు రౌండ్లు నడిచాకనే

ఇంటికెళ్లాలని జాన్‌కి రెడ్డి బాధ్యతను అప్పజెప్పాడు. లేకుంటే ఆయనే తీసుకువెళ్లేవాడు. ఆయన ఆర్మీలో వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకొని ప్రస్తుతం ఒక కాలేజిలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. అంకిరెడ్డి స్నేహాన్ని మనస్ఫూర్తిగా కోరుకునేవాళ్లలో ఆయనొకడు.

"లే! రెడ్డీ వెళదాం!" అంటూ అంకిరెడ్డిని ఇంటిదగ్గర డ్రాప్ చేసి రావటానికి జాన్ సిద్ధమయ్యాడు. జాన్ కొంతకాలం ఏర్‌ఫోర్స్‌లో ఉద్యోగం చేసి వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకొని ప్రస్తుతం బ్యాంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు.

అంకిరెడ్డి మాట్లాడకుండా మౌనంగా చూస్తున్నాడు. తన కోసం తన స్నేహితులు వాకింగ్‌ను మధ్యలో మానేసి తన దగ్గర వున్నారన్న ధ్యాస కూడా ఆయనకు లేదు... జాన్ మళ్లీ అడిగితే "వద్దు జాన్! నేను వెళ్లగలను. మీరు వాకింగ్‌కి వెళ్లండి!" అన్నాడు.

వాళ్లు వెళ్లలేదు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ అక్కడే వున్నారు.

నాయక్ అంకిరెడ్డి పక్కన కూర్చుని అంకిరెడ్డి వైపు పరీక్షగా చూస్తున్నాడు. నాయక్‌కి తెలుసు అంకిరెడ్డి అందరికన్నా ఉత్సాహంగా, హుషారుగా, పుష్టిగా వుంటాడని... అంతేకాదు ఎండా, వాన, చలి అన్నది చూడకుండా వాకింగ్ చేస్తుంటాడు. వానలో గొడుగు పట్టుకొని, చలిలో షాల్వ్ కప్పుకొని వాకింగ్ చెయ్యటం అదో రకమైన థ్రిల్ నాకు అని కూడా అంటుంటాడు. నిన్న కూడా బాగానే వున్నాడు. ఇవాళే బాగా క్రుంగినట్లు కన్పిస్తున్నాడు. ఒక్కరోజులోనే ఇంత మార్పా? ఎందుకో ఏమో అని మనసులో అనుకొని అక్కడ నుండి సడెన్‌గా లేచి వాసుదేవ్‌ని చేయి పట్టుకొని పక్కకి తీసికెళ్లాడు.

"ఏంటి నాయక్? ఎందుకిలా తీసుకొచ్చావ్?" అర్థం కానట్లు చూస్తూ అడిగాడు వాసుదేవ్.

"అంకిరెడ్డిని చూస్తుంటే నాకేదో అనుమానంగా వుంది వాసు!"

"అనుమానం దేనికి నాయక్?"

"అంకిరెడ్డి పడింది కాలుజారో, బురద వల్లనో అనుకుంటున్నావా?"

“అవును. దాని వల్లనే పడిపోయాడు. మనం పిలవగానే రోడ్డుమీదకి వచ్చి వుంటే ఈ ఇన్సిడెంట్ జరిగేది కాదు” అన్నాడు వాసుదేవ్.

“నువ్వలా అనుకుంటున్నావు కాని అది కరక్ట్ కాదు వాసూ! అంకిరెడ్డి నడుస్తున్న ప్రాంతంలో అసలు బురదే లేదు. బురదకి పది అడుగుల దూరంలో ఆయన వుండగానే మనం పిలిచాం. ఈ లోపలే పడిపోయాడు” అన్నాడు నాయక్.

“అయితే నువ్వనేది ఏంటి నాయక్? నాకేం అర్థం కావటం లేదు” అన్నాడు వాసుదేవ్.

“ఆయనకు బి.పి. పెరిగో, షుగర్ డౌన్ అయ్యో పడిపోలేదు. అసలు ఆయనకి ఆ జబ్బులేం లేవు వాసుదేవ్! ఇంకేదో జబ్బు రెడ్డి శరీరంలో తయారవుతుండవచ్చు. అది ఆయనకు తెలిసి కూడా మన దగ్గర దాచిపెడుతున్నాడు... మనం పిలుస్తున్నా వినకుండా ఆయన దిగుల్లో ఆయన వుండి సడెన్‌గా కిందపడిపోయి వుంటాడు” అన్నాడు నాయక్.

నాయక్ చెప్పింది విని నిజమే కావచ్చు అనుకున్నాడు వాసుదేవ్. నాయక్ కూడా వాసుదేవ్, జాన్‌లాగే నేవీలో కొంతకాలం పనిచేసి వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకొని ప్రస్తుతం మోటర్లు, పైపులు అమ్మే షాపులో షిఫ్ట్ టైం పనిచేస్తూ ఎక్కువగా ఇంట్లోనే గడుపుతుంటాడు. ఎన్ని పనులు వున్నా నెలనెలా హాస్పిటల్‌కి వెళ్లి అన్ని టెస్ట్‌లు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని చాలా జాగ్రత్తగా చూసుకుంటుంటాడు.

“సరే! రా! వెళ్లి రెడ్డితో మాట్లాడదాం నాయక్!” అంటూ నాయక్‌ను అక్కడి నుండి తీసుకొని రెడ్డి దగ్గరకి వచ్చాడు వాసుదేవ్.

రెడ్డి చెట్టు మొదట్లో అలాగే కూర్చుని చూపుల్ని ఎక్కడో నిలిపి తన ఆలోచనలో తనున్నాడు. ఆయనకు అప్పుడే ఇంటికి వెళ్లాలని పించటం లేదు. ముఖ్యంగా తన బాధను భార్యతో పంచుకోవాలంటే భయపడుతున్నాడు. ఇంటికెళ్తే “ఏంటండీ! అలా వున్నారు?” అని మళ్లీ అడుగుతుందేమోనని కంగారుగా వుంది. తను ఎలాగైనా ధైర్యం

తెచ్చుకోవాలి. మానసికంగా బలవంతుడు కావాలి. కళ్లు మూసుకుని చాలాసేపు అలాగే కూర్చుంటే శక్తి వస్తుందేమోనని కళ్లు మూసుకున్నాడు.

పక్కనే కూర్చుని వున్న జాన్ రెడ్డిని కదిలించకుండా అలాగే చూస్తున్నాడు.

వాసుదేవ్, నాయక్ వచ్చి ఆయన భుజం తట్టి “లే! రెడ్డి! ఇంటికెళ్దాం! ఇంటికెళ్తే పడుకోవచ్చు, ఇక్కడ ఎంతసేపని కూర్చుంటావు. మళ్లీ మబ్బులు మొదలయ్యాయి. వర్షం వచ్చేలా వుంది” అన్నారు నెమ్మదిగా.

రెడ్డి నెమ్మదిగా కళ్లు విప్పి పేలవంగా నవ్వాడు.

“ఎందుకు రెడ్డీ అలా నవ్వుతావు. మేమంతా వెళ్లిపోతే ఇక్కడ ఎవరూ వుండరు. ఒక్కడివే ఒంటరిగా ఎంతసేపని ఇలా కూర్చుంటావ్? పైగా వాతావరణం కూడా నిమిష నిమిషానికి చల్లపడుతోంది. ఎక్కడో తుఫాన్ అట...” అన్నాడు జాన్.

“నాలో నిమిషనిమిషానికి భయపెడుతున్న తుఫాన్ కన్నా ఈ బయట వచ్చే తుఫాన్ అంత పెద్దదా జాన్! నాకు ఇంట్లో కన్నా ఈ విశాలమైన మైదానంలో... ఈ చెట్టు కిందనే బాగుంది. మబ్బుల మీద నుండి తేలి వస్తున్న ఈ చల్లగాలికి నా బుర్రలో వున్న వేడిని తగ్గించుకుంటాను. మీ ముగ్గురు వెళ్లిపొండి!” అన్నాడు.

అంకిరెడ్డి మాటలకు వాళ్లు ముగ్గురు విస్తుపోయారు.

“నాయక్! నువ్వు చెప్పింది నిజమే!” అన్నట్లు నాయక్ వైపు చూశాడు వాసుదేవ్.

“అంకిరెడ్డితో మాట్లాడు వాసుదేవ్! మనం కాకుంటే ఆయనకు ఎవరున్నారు? ఇలాంటి సమయంలోనే కదా ధైర్యం చెప్పాలి” అన్నట్లు వాసుదేవ్ వైపు చూశాడు నాయక్.

“అలాగే!” అన్నట్లు కళ్లతోనే సైగచేశాడు వాసుదేవ్.

అంకిరెడ్డికి అటువైపు జాన్ కూర్చుని వుంటే ఇటువైపున వాసుదేవ్ కూర్చుని “నువ్వు కూడా కూర్చో నాయక్!” అంటూ నాయక్‌ను తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు.

వాళ్లు అలా కూర్చున్నారో లేదో గాలి, వాన మొదలైంది. వాళ్లు అనుకుని కూర్చున్న చెట్టు కూడా గాలికి ఊగసాగింది.

"ఇక్కడ వుంటే తడిసిపోతాం రెడ్డీ!" అంటూ ముగ్గురు కలిసి అంకిరెడ్డిని బలవంతంగా అక్కడి నుండి తీసికెళ్లి కారులో కూర్చోబెట్టారు.

"రెడ్డీ! నువ్వు కారును డ్రైవ్ చేసుకుంటూ వెళ్లగలవా? లేక మాలో ఎవరో ఒకరం తోడుగా రావాలా?" అడిగాడు జాన్.

"వద్దు జాన్! ఫిజికల్‌గా నేను బాగానే వున్నాను. మీరేం కంగారు పడకండి! నేను వెళ్లగలను" అంటూ స్నేహితులు ముగ్గురికి 'బై' చెప్పి స్టీరింగ్ పట్టుకుని రోడ్డు మీదకి చూశాడు. వర్షం ఎక్కువైంది.

స్నేహితులు ఎవరి కార్లో వాళ్లు కూర్చుని వెళ్లిపోయారు.

స్టీరింగ్ పట్టుకుని కూర్చున్న ఆయన చేతులు అప్రయత్నంగానే వణికాయి. ఒకటే నిర్ణయించుకున్నాడు. ఇంటికెళ్లాక తలనొప్పిగా వుందని ఆఫీసుకి సెలవు పెట్టాలి. తలకి గుడ్డ కట్టుకొని పడుకోవాలి. అలా చేస్తే మాధవీలత తన గురించి ఎక్కువగా ఆలోచించదు. మహా అయితే ఒకటికి రెండుసార్లు కాఫీ కలిపి ఇస్తుంది. పెయిన్ కిల్లర్ వేసుకోమంటుంది. ఒక అర్ధగంట గడవనిచ్చి 'ఇప్పుడెలా వుందండీ?' అంటూ తన చుట్టూ తిరుగుతుంది. అంతకన్నా ఇంకేం హడావుడి చెయ్యదు. కంగారు పెట్టదు. తలనొప్పి వల్లనే తన భర్త అలా వున్నాడని మనసుకు నచ్చచెప్పుకుంటుంది. ఎప్పటిలాగే ఇంటి పనిలో పడిపోతుంది అని అంకిరెడ్డి అనుకుంటుండగానే ఇల్లు వచ్చింది.

కారు దిగి ఇంట్లోకి వెళ్లాడు.

ఇంట్లోకెళ్లగానే మాధవీలత జాడ లేదు. ఎప్పుడైనా గేటు దగ్గరకి కారు వెళ్లగానే నవ్వుకుంటూ వచ్చేది. చిన్నపిల్లలా ఉత్సాహంగా వచ్చి గేటు తీసేది. ఇవాళ అలాంటి పనేం చెయ్యలేదు. ఇంట్లోకి వెళ్లాక కూడా ఎదురు రాలేదు. వంటగదిలో వుందేమో అనుకున్నాడు. అక్కడా లేదు. ఎక్కడుంది మాధవి? కన్పించదేం? అనుకుంటూ ఇల్లంతా వెదికాడు. బాల్కనీలోకి వెళ్లాడు. "మధూ! మధూ!" అంటూ పిలిచాడు.

ఆమె బాల్కనీ చివరన అటువైపుకి తిరిగి కూర్చుని వుంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Jeevitam+Ila+Kuda+Vuntunda**

* * *